క్లుప్తంగా

ఆలయ భూమి కబ్జాపై లోకాయుక్తలో పిటిషన్

పరకాల ఆర్డీఓ నారాయణ విచారణ



శాయంపేట: మండల కేంద్రంలోని తాళ్లకుంట చెరువు సమీపంలో ఉన్న కనకదుర్గ ఆలయ భూమిని కబ్జా చేశారని స్థానికుడు వంగరి సాంబయ్య లోకాయుక్తలో పిటిషన్ వేశారు. దీనిపై పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ, తహసీల్దార్ సుభాషిణి, ఎమ్మార్వై శరత్‌కుమార్, సర్వేయర్ స్టాలిన్ బుధవారం ఆలయ భూములపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఆలయ భూమిని కొంతమంది రైతులు కబ్జా చేశారని సాంబయ్య లోకాయుక్తలో పిటిషన్ వేసినట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణం ప్రభుత్వ స్థలంలో ఉందని, ఎండోమెంట్ ప్రకారం రెవెన్యూ రికార్డులో లేనప్పటికీ, ఆలయానికి మూడు గుంటల స్థలం, వెళ్లడానికి రహదారి ఏర్పాటు చేయాలని, కబ్జా కాకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. శిథిలావస్థకు చెందిన ఆలయాన్ని కూడా పునరుద్ధరించాలని దరఖాస్తుదారుడిని కోరినట్లు పేర్కొన్నారు. విచారణ నివేదికను లోకాయుక్తలో సమర్పించనున్నట్లు ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు బాసాని లక్ష్మీనారాయణ, రవి పాల్గొన్నారు.

అండగా ఉంటాం..

దామెర : బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు అన్నారు. మండలంలోని పులుకుర్తిలో ఇటీవల అనారోగ్యంతో కాశెట్టి కిరణ్ మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను బుధవారం ఆయన పరామర్శించారు. అనంతరం కిరణ్ మృతికిగల కారణాలు తెలుసుకున్నారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, ప్రధాన కార్యదర్శి సతీశ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి చందర్, మాజీ సర్పంచ్ సత్యం, బూత్ అధ్యక్షుడు పవన్, రాజు, మహేశ్, నాగరాజు, నాగరాజు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు బీఆర్ఎస్‌కు లేదు



ఆత్మకూరు : కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు బీఆర్ఎస్ పార్టీ నాయకులకు లేదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అర్షం అశోక్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత కౌశిక్‌రెడ్డి విమర్శలు చేయడం తగదన్నారు. రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అన్యాయం, అక్రమాలను ఎండగడుతూ కాంగ్రెస్ ప్రజాపాలన కొనసాగిస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాధరణ చూసి బీఆర్ఎస్ నాయకులకు కళ్లు మండుతున్నాయని ధ్వజమెత్తారు. మరోమారు అర్థరహిత విమర్శలు, ఆరోపణలు చేస్తే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని అన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని హితవు పలికారు. కిరణ్‌కుమార్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరి పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఇంపాక్ట్ ఆఫ్ మ్యాక్రో ఎకనామిక్ వేరియబుల్స్ ఆఫ్ ఇండియన్ స్టాక్ మార్కెట్ – ఏ స్టడీ సెలెక్ట్ సెక్టార్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు ఆర్షియా సుల్తానాకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. కామర్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో సుల్తానా తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, చెరబండరాజు నవలలు – కథలు తెలంగాణ జనజీవనం అనే అంశంపై తెలుగు విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయని పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధన సిద్ధాంత గ్రంథానికి పరిశోధకుడు సంపత్‌రెడ్డికి డాక్టరేట్ అందజేసినట్లు నర్సింహాచారి వివరించారు. వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంపత్‌రెడ్డి తెలుగు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

కిట్స్ అధ్యాపకుడికి..

హసన్‌పర్తి: కిట్స్ సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న షర్ఫొద్దీన్ వసీం.. తరుచిరాపల్లి ఎన్ఐటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈ మేరకు బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు ఎన్ఐటీ తిరుచిరాపల్లి డైరెక్టర్ ప్రొఫెసర్ ఆగిల డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ ఎం.బృంద పర్యవేక్షణలో 'టెక్స్ట్ డిటెక్షన్ ఫ్రమ్ నేచురల్ సీన్ ఇమేజెస్ యూజింగ్ డీప్ లెర్నింగ్ ప్రిన్సిపుల్స్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వసీంకు డాక్టరేట్ అందజేశారు.

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

- గ్రామానికి దూరంగా ఏర్పాటు
- బోర్డులు పాతి వదిలేసిన అధికారులు
- అసహనం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు



పీచర గ్రామంలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

వేలేరు : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించి యువకుల్లో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో క్రీడాకారులు అటువైపు చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ స్థలం లేక పాఠశాలల్లోనే బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు.. చేతులు దులుపుకొన్నారని క్రీడాకారులు మండిపడుతున్నారు. అలాగే కొన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు పూర్తయినా వాటిలో పరికరాలు లేవని, మరికొన్ని గ్రామాల్లో గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడంతో క్రీడాకారులు అక్కడికి వెళ్లేందుకు ఆసక్తి చూపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్రీడా ప్రాంగణాల పనులను పూర్తిచేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో అప్పటి సర్పంచ్‌లు ఉపాధి హామీ నిధులతో పనులు చేపట్టారు. అయితే పూర్తిచేసిన పనులకు ఇప్పటికీ బిల్లులు రాలేదని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో కేవలం 5 గ్రామాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. మిగతా గ్రామపంచాయతీల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడం, ఇతర కారణాలతో ఏర్పాటు చేయలేదు. అయా క్రీడా ప్రాంగణాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌తో పాటు వివిధ క్రీడలకు సంబంధించిన కోర్టులను ఏర్పాటు చేయలేదు. దీంతో క్రీడాకారులు మైదానాల్లో ఆడుకునేందుకు మొగ్గు చూపడం లేదు. క్రీడా ప్రాంగణాల్లో బోర్డులకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు చేసిన అధికారులు మిగతా సౌకర్యాలు కల్పించడంలో శ్రద్ధ చూపడం లేదని క్రీడాకారులు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా వసతులు కల్పించాలని, గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించాలని క్రీడాకారులు కోరుతున్నారు.



వేలేరు పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాగణం బోర్డు

సౌకర్యాలు కల్పించాలి



క్రీడా ప్రాంగణం స్కూల్‌లో ఏర్పాటు చేసినట్లు బోర్డు పెట్టారు. కానీ ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. పాఠశాలలో ఏర్పాటు చేయడం వలన యువతకు, విద్యార్థులకు ఏలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుత ప్రభుత్వం క్రీడాకారులపై దృష్టి సారించాలి.

– మిడిదొడ్డి శ్రీకాంత్, క్రీడాకారుడు

చేతులు కలుపుదాం.. చేనేతను ఆదుకుందాం



కమలాపూర్ : ర్యాలీలో చేనేత కార్మికులు

కమలాపూర్ : మండల కేంద్రంలో బుధవారం కమలాపూర్ చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాపూర్‌లో చేనేత కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించి 'చేయి చేయి కలుపుదాం.. చేనేతకు చేయూతనిద్దాం, చేనేత వస్త్రాలను ధరిద్దాం.. చేనేత కళా రంగాన్ని ప్రోత్సహిద్దాం, చేనేత కార్మికులకు పని కల్పించాలి, చేనేత కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు. అనంతరం చేనేత కార్మికులు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత రంగాన్ని ప్రోత్సహించాలని కోరారు. నానాటికి చేనేత కార్మికుల బతుకులు దుర్భరంగా మారుతున్నాయని, కళాత్మక చేనేత రంగాన్ని ఆదుకుని పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం మేనేజర్ సామల దామోదర్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



పరకాల : చేనేత కార్మికులను సన్మానిస్తున్న రాజేశ్వరప్రసాద్, తదితరులు

పరకాలలో..

హన్మకొండ (పరకాల) : ఆర్థికంగా వెనుకబడిన చేనేత కార్మికులను ఆదుకునేందుకు మెగా టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణంతో పాటు చేనేత కార్మికులందరికీ మగ్గాలను ఉచితంగా అందించాలని పోపా పరకాల గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పోతాని రాజేశ్వరప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పరకాల పట్టణంలోని శ్రీనివాసకాలనీ, వెల్లంపల్లి గ్రామంలోని చేనేత సొసైటీ సభ్యులను పోపా పరకాల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మానవ శరీరానికి కవచంగా ఉండే దుస్తులను నేసినటువంటి గొప్ప చరిత్ర గల వంశం పద్మశాలి అన్నారు. అలాంటి వంశ పుత్రులంతా నేడు చేతినిండ పనిలేక ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని, పాలకులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు.

కూలి కోసం వెళ్లి గాయాల పాలై..

- ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆటో
- 8 మంది మహిళా కూలీలు, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఐనవోలు : ఇంటి అవసరాలు తీర్చేందుకు కూలి పనులకు వెళ్లిన మహిళలు రోడ్డు ప్రమాదంలో గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పొలంలో నాటు వేసి తిరిగి వస్తున్న క్రమంలో వీరు ప్రయాణిస్తున్న ఆటో ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో అందులో ఉన్న 8 మంది మహిళా కూలీలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పంథిని గ్రామ శివారు వరంగల్–ఖమ్మం రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామానికి చెందిన పలువురు మహిళా కూలీలు పొలంలో నాటు వేసేందుకు ఉదయం ఆటోలో వెళ్లారు. పనులు పూర్తి చేసుకుని రాత్రి పున్నేలు క్రాస్ నుంచి ఆటోలో ఇంటికి వెళ్తున్న క్రమంలో పంథిని శివారుకు చేరుకోగా రోడ్డుపై సైడ్‌కు ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఆటో డ్రైవర్ గమనించకుండా బలంగా ఢీకొన్నాడు. దీంతో ఆటోలో ఉన్న 8 మహిళలు, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం అందించి ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్తంగా

మైక్‌సెట్ బహూకరణ

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1953 నుంచి 1958 వరకు ఉపాధ్యాయుడిగా పనిచేసిన దేవులపల్లి సాంబశివరావు స్మారకార్థం అతని కుటుంబ సభ్యులు బుధవారం రూ. 15వేలు విలువచేసే మైక్ సెట్‌ను అదే పాఠశాలకు బహూకరించారు. పాఠశాలలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు, ప్రతీరోజు నిర్వహించే అసెంబ్లీ కార్యక్రమానికి వినియోగించేందుకు బహూకరించినట్లు అతని కుమారుడు శివప్రసాద్ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు వనం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, సాంబశివరావు కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

కమలాపూర్ : మండలంలోని గూడూరులో అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నద్దునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కుమ్మరి సాజన్, కుమ్మరి అనిల్, ప్రధానకార్యదర్శిగా కుమ్మరి ప్రశాంత్, కోశాధికారిగా కుమ్మరి శివకుమార్, సీనియర్ నాయకులుగా కుమ్మరి ప్రకాశ్, కుమ్మరి లక్ష్మణ్, కుమ్మరి శ్రీకాంత్, కుమ్మరి భాను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నద్దునూరి సదానందం, గాజుల సురేశ్, కుమ్మరి బాబు, కుమ్మరి రవి, యూత్ నాయకులు పాల్గొన్నారు.

9న నవనాగ క్షేత్రంలో అభిషేకం

ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లి గ్రామ శివారులో గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నవనాగ క్షేత్రంలో శుక్రవారం అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు గంట సీతారామారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



శాయంపేట : ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ రంజిత్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట వాహనాలను తనిఖీ చేశారు. స్కూల్ బస్సుల్లో విద్యార్థులు ఎంత మంది ప్రయాణిస్తున్నారని ప్రశ్నించి తనిఖీ చేశారు. సరియైన పత్రాలు లేని 5 ఆటోలు, 5 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఓ ఆటో డ్రైవర్ అతిగా మద్యం సేవించి ఆటో నడుపుతుండగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా డ్రైవర్‌కు 249 పాయింట్లు వచ్చిందని, దీంతో ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మైనర్‌లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే వాహన యాజమానిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : వాహనదారులు సరియైన పత్రాలు కలిగి ఉండాలని ఎస్సై సురేశ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై సురేశ్ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, ఇతర పత్రాలు కలిగి ఉండాలన్నారు. నిబంధనలు పాటించకపోతే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఐనవోలు : మండలంలోని నందనం గ్రామానికి చెందిన మాచవరం మధుకర్ మండల కేంద్రంలోని ఎంపీపీఎస్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల పదోన్నతి పొంది భీమదేవరపల్లి మండలానికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఆయనను శాలువాతో సన్మానించారు. కాగా మధుకర్ రూ.3,600 విలువచేసే వాటర్ బాటిళ్లను పాఠశాలలో చదువుకుంటున్న 90 మంది విద్యార్థులకు అందించారు. మధుకర్ మాట్లాడుతూ.. చిన్నతనంలోనే కష్టపడి పనిచేయడం అలవరుచుకున్నానని, పేదరికం చదువుకు అడ్డుకాకుడదని అభిప్రాయపడ్డారు. కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, మహేందర్‌రెడ్డి, సారయ్య, లక్ష్మి, విజయ, భవన్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

హన్మకొండ (పరకాల) : జనగామలో న్యాయవాద దంపతులపై పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ పరకాల బార్ అసోసియేషన్ పిలుపు మేరకు న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించి ధర్నా చేపట్టారు. సీనియర్ న్యాయవాది ఒంటేరు రాజమౌళి మాట్లాడుతూ.. న్యాయవాద దంపతులపై దాడి చేసిన పోలీసులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కూకట్ల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి శ్రావణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ లక్కం శంకర్, మాజీ అధ్యక్షుడు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల

శాయంపేట : తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండలంలోని గోవిందాపూర్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధానవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలను తాగించడం వలన బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు అదనపు ఆహారం అందించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సులోచన, ఆయా మణేమ్మ, గర్భిణులు తల్లులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని సరస్వతి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి ఘనంగా నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత, ముర్రుపాల విశిష్టతను, ఆమె వివరించారు. పుట్టిన శిశువుకు ముర్రుపాలు తప్పకుండా పట్టించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, వీఓ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

- మామునూరు ఏసీపీ తిరుపతి



ఐనవోలు : పూలమొక్క నాటుతున్న ఏసీపీ తిరుపతి



వేలేరు : మొక్క నాటుతున్న ప్రత్యేకాధికారి మల్లయ్య, ఎస్సై సురేశ్

ఐనవోలు : మొక్కల పెంపకం సామాజిక బాధ్యతని మామునూరు ఏసీపీ తిరుపతి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండ్ల, పూల, నీడనిచ్చే మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. విచక్షణ రహితంగా చెట్లను నరకొద్దని హితవు పలికారు. నాటిన మొక్కలను సంరక్షించాలని, భారీ వృక్షాలను నరకకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందన్నారు. అనుమతి లేకుండా చెట్లను నరికితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మండల వ్యాప్తంగా ఐదు రోజుల్లో ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో 2,500 మొక్కలు నాటి సంరక్షించనున్నట్లు వెల్లడించారు. కేజీబీవీలోకి అనుమతి లేని వాహనాలు రాకుండా బాలికల సంరక్షణ కోసం చెక్‌పోస్టు గేట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇన్‌చార్జ్ ఎస్ఓ సత్యవాణి, టీచర్లు, కానిస్టేబుళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : మొక్కల పెంపకం అందరి బాధ్యతని మండల ప్రత్యేకాధికారి మల్లయ్య, ఎస్సై సురేశ్ అన్నారు. మండలంలోని కేజీబీవీలో బుధవారం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతీ పౌరుడి బాధ్యతని, మొక్కలు నాటి వాటిని కాపాడాలని అన్నారు. అనంతరం సైబర్ క్రైం నేరాలు, సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటర్‌నెట్‌ను అవసరాన్ని మించి వాడొద్దని సూచించారు. పాఠశాల ఎస్ఓ స్రవంతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యలవాగులో చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

వేలేరు : మండల కేంద్రంలోని మద్యలవాగులో చెత్తాచెదారం పేరుకుపోయిందని మంగళవారం సాక్షి దినపత్రిలో ప్రచురితమైన 'వాగులోనే చెత్తాచెదారం' అనే కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం మండల ప్రత్యేకాధికారి మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ చెత్తాచెదారాన్ని జేసీబీ, ట్రాక్టర్లతో తొలగించారు. వాగులో చికెన్ వ్యర్థాలు వేయకుండా చికెన్ సెంటర్ల నిర్వహకులకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.



వాగులోని చెత్తచెదారం తొలగిస్తున్న అధికారులు

కోర్టు విధుల బహిష్కరణ.. ర్యాలీ



ఆర్టీసీ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

జనగామ: ఓ కేసు విషయమై మాట్లాడేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాద దంపతులు అమృతరావు, కవితలపై పోలీసులు దాడి చేశారని నిరసిస్తూ జనగామ కోర్టులో రెండోరోజు బుధవారం విధులను బహిష్కరించారు. న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలగందుల చంద్రరుషి ఆధ్వర్యాన అడ్వొకేట్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా వరంగల్, భూపాలపల్లి, పరకాల, సిద్దిపేట, రంగారెడ్డి, సూర్యాపేట, హైదరాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం జిల్లాలకు చెందిన బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వచ్చారు. ప్రముఖులు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో ఉదయం, మధ్యాహ్నం చర్చలు జరిపారు. సీఐతోపాటు దాడిలో పాల్గొన్న ఎస్సై, పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేసి కేసు నమోదు చేయాలని పట్టుబట్టారు. చర్చలు విఫలం కావడంతో కోర్టు ఆవరణ నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించగా.. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఇంకుడుగుంత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

హన్మకొండ (పరకాల): స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా పరకాల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఇంకుడు గుంతల నిర్మాణ పనులు ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయిందని ఆరోపించారు. మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పట్టణంలోని రోడ్లపై వీధికుక్కలు, పశువులు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహాను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితారామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో పనిచేయాలి..

నడికూడ: ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణలో చేపట్టిన టాయిలెట్స్, ప్లేగ్రౌండ్, డైనింగ్ హాల్ పనులు పరిశీలించి పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించి, పోలీస్ స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయాలకు స్థల సేకరణ చేసి హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్డీఓ నారాయణ, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : వర్షాకాలంలో దోమల ఉధృతి పెరుగకుండా ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జెడ్పీ సీఈఓ విద్యాలత సూచించారు. బుధవారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో మూడోరోజు స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. డ్రెయినేజీ క్లీనింగ్, దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయడం, అవెన్యూ ప్లాంటేషన్‌తో పాటు తదితర పనులను దగ్గరుండి చేయించారు. ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. స్పెషల్ ఆఫీసర్ సురేఖ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఒగ్లాపూర్ గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఇంజపెల్లి నరేశ్ అన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పరిసర ప్రాంతాల్లో శ్రమదానం చేసి పిచ్చిమొక్కలను తొలిగించారు.

చిన్నారులకు కుర్చీల బహూకరణ

కమలాపూర్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న చిన్నారులకు సాయం అందించడం సంతోషంగా ఉందని మండలంలోని కన్నూరు మాజీ సర్పంచ్ పుల్లూరి రాంచందర్‌రావు అన్నారు. గ్రామంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులకు బుధవారం కుర్చీలు బహూకరించారు. చిన్నారులు కూర్చునేందుకు కుర్చీలు అందించడం సంతోషంగా ఉందన్నారు.

సామూహిక కంకుమార్చన

వరంగల్ చౌరస్తా: వరంగల్ రామన్నపేట బట్టల బజారులోని బాలానగర వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం పవిత్రోత్సవాల ముగింపు, ఆండాళమ్మ తిరునక్షత్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా సందడి నెలకొంది.